హెచ్‌సీఏ ఉమెన్స్ లీగ్ షురూ



క్రికెటర్లతో కరచాలనం చేస్తున్న జగన్‌మోహన్‌రావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) చరిత్రలో తొలిసారిగా మహిళా క్రికెటర్ల కోసం ఉమెన్స్ లీగ్‌ను ప్రారంభించామని ఆ సంఘం అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు తెలిపారు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఉమెన్స్ లీగ్ ప్రారంభోత్సవంలో జగన్ మాట్లాడుతూ అండర్-15, అండర్-17, అండర్-19 విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 450 మంది మహిళా క్రికెటర్లు పాల్గొంటున్నారని చెప్పారు. భారత జట్టు మాజీ కెప్టెన్, హైదరాబాద్ దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ వంటి మేటి మహిళా క్రికెటర్లను తయారు చేయాలనే ఆశయంతో ఈ లీగ్‌కు రూపకల్పన చేశామని చెప్పారు.

తనీష్ హాఫ్ సెంచరీ..

హెచ్‌సీఏ అండర్-16 బాలుర అంతర్ పాఠశాలల వన్డే టోర్నమెంట్‌లో బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఓపెనర్ తనీష్ చక్రవర్తి హాఫ్ సెంచరీతో (53 బంతుల్లో 77 పరుగులు) సత్తా చాటడంతో ఆ జట్టు జయకేతనం ఎగురవేసింది. సోమవారం పీజేఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బిర్లా టీమ్ 3 వికెట్ల నష్టానికి 20 ఓవర్లలో 184 పరుగులు చేసింది. ఛేదనలో లిబర్టీ హైస్కూల్ జట్టు 14.2 ఓవర్లలో 54కు ఆలౌటై, ఓటమి పాలైంది. బిర్లా బౌలర్లు సిద్ధార్థ్, రోహన్ చెరో రెండు వికెట్లు తీసి సత్తా చాటారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

బేగంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ డివిజన్‌లోని దుర్గానగర్ కాలనీ పార్కులో ఈనెల 10,11 తేదీల్లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 10 టీంలు పాల్గొన్నాయి. వీటిలో విన్నర్ టీంగా హరి, నాగేష్‌లు, రన్నర్ ఆఫ్ ది టీంగా జరీన్, జోషి నిలిచారు. పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ పి.విజయారెడ్డి హాజరై విజేతలకు బహుమతలను అందజేశారు.



అమీర్‌పేట మెట్రోస్టేషన్ వద్ద సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

మెట్రోరైల్ బోగీలను పెంచాలంటూ సంతకాల సేకరణ

అమీర్‌పేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రోరైల్ బోగీలు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం అమీర్‌పేట మెట్రోస్టేషన్ వద్ద సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర సెక్రటేరియట్ సభ్యురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ మెట్రో రైల్‌లో రద్దీ విపరీతంగా ఉండడంతో ఏ రైల్ ఎక్కాలన్నా దిగాలన్నా ప్రయాణీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మెట్రోకు ఉన్న మూడు బోగీలకు అదనంగా మరో మూడు బోగీలు జత చేయాని డిమాండ్ చేశారు. ఆగస్టు 12 నుంచి నగరంలో ఉన్న మెట్రోస్టేషన్ల వద్ద ఆగస్టు 13, 14 తేదీలలో కూడా సంతకాల సేకరణ చేసి 17 తేదీన మెట్రో భవన్ బేగంపేట వద్ద ధర్నా నిర్వహిస్తామని సీపీఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు రాపర్తి అశోక్, నాయకులు టి, సాయి శేషగిరి, స్వామి, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

"ఏ శక్తి ఆపలేదు నవభారత ప్రగతిని" పాట విడుదల



సీడీని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా

బంజారాహిల్స్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో దేశ ఘన విజయాలను వ్యక్తపరుస్తూ జీవీ రావు రూపొందింన ఏ శక్తి ఆపలేదు నవభారత ప్రగతిని అనే పాటను బంజారాహిల్స్‌లో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా ఆవిష్కరించారు. ఈ పాటకు మౌనశ్రీ మల్లిక్ సాహిత్యాన్ని అందించగా డాక్టర్ యశోకృష్ణ సంగీతాన్ని సమకూర్చారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత ప్రగతితో పాటు 2024 ఎలక్షన్స్ ను కలిపి పాటను రూపొందించినట్లు చెప్పారు.

బోరబండ గణేశ్ ఉత్సవ కమిటీ ఎన్నిక

బోరబండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని బీజేపీ నాయకులు టి.లక్ష్మణ్, కృష్ణమోహన్ సూచించారు. సోమవారం సైట్-3 దేవయ్య బస్తీ కమ్యూనిటీ హాల్లో బోరబండ గణేశ్ ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోరబండ గణేశ్ ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా పిట్ల మనోహర్, జాయింట్ కన్వీనర్‌గా సతీష్ చారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ డివిజన్‌లోని వినాయక మండపాలకు కావాల్సిన సహాయ సహకారం అందిస్తామన్నారు. మండప నిర్వాహకులు పర్యవరణ పరిరక్షణకు మట్టి గణనాథులను ప్రతిష్ఠించాలని వారు సూచించారు.

నేడు సిద్దార్థనగర్‌లో సమస్యలపై శంఖారావం

పంజాగుట్ట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ సిద్దార్థనగర్ కమ్యూనిటీ హాలులో ఈనెల 13న ఉదయం సమస్యలపై శంఖారావం కార్యక్రమం జరుగనుంది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. పోలీస్, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, వీధి దీపాలు, రెవెన్యూ, పౌర సరఫరాలు, తదితర శాఖల అధికారులు పాల్గొంటారు. స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తారు.

విగ్రహాల శుభ్రత



స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల విగ్రహాల శుభ్రత, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా జవహర్‌నగర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని శుభ్రం చేసి వారికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లంకల దీపక్‌రెడ్డి, కుంబాల గంగరాజు, విజయకుమార్, బీజేపీ నాయకులు

- పంజాగుట్ట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి)

నివాళి



ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ మారణ హోమంలో మరణించిన హిందువులకు కొవ్వొత్తుల నివాళులర్పిస్తున్న ప్రతినిధులు రాజ్‌కుమార్, వీణ మాధురి, బాలకుమార్, రాచప్ప, శ్రీరాములు, ప్రవీణ్ తదితరులు

- ఖైరతాబాద్ (ఆంధ్రజ్యోతి)

రాడార్ ప్రాజెక్ట్‌కు రిజర్వ్ ఫారెస్ట్ భూమిని కేటాయించొద్దు



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

పంజాగుట్ట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోని సహజమైన అటవీ భూములను భారత నౌకాదళానికి వెరీ లో ఫ్రీక్వెన్సీ(వీఎల్ఎఫ్) రాడార్ స్టేషన్ కోసం కేటాయించొద్దని వివిధ సంస్థల నాయకులు డిమాండ్ చేశారు. అనంతగిరి కొండల్లోని సహజమైన అటవీ భూములను వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ కోసం కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.కార్తీక్‌యాదవ్, సమన్వయకర్త రాజుయదవ్, భారత్ కిసాన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డి.కె.చంద్రశేఖర్‌యాదవ్, గీత, సామాజిక కార్యకర్త రుచిత్ ఆశా కమల్, శ్రీశైలంయాదవ్, ఆదిత్య, లోకేష్, తదితరులు మాట్లాడారు. విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ (ఈఎన్సీ)ప్రతిపాదించిన వీఎల్ఎఫ్ రాడార్‌స్టేషన్ తక్కువ ఫ్రీక్వెన్సీ రేడియో తరంగాలను ఉపయోగించి నౌకలు, జలాంతర్గాములతో కమ్యూనికేట్ చేస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం అడవుల్లో 2,900 ఎకరాల అటవీ భూమిలోని 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందని అన్నారు. 20 గ్రామాల్లోని సుమారు 60వేల మంది ప్రజల జీవితాలపై, అడవిపై ఆధారపడిన చిన్న రైతులు, పశువుల మేత, జీవుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ విధ్వంసం పెరిగి నేల కోతకు గురవుతుందని, మూసీ, కాగ్నా, తదితర నదులపై కూడా ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రపంచ వాతావరణ సంక్షోభాల రీత్యా దామగుండం అడవుల్లో రాడార్ ప్రాజెక్ట్‌ను కొనసాగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటలూ ముఖ్యమే : ఎమ్మెల్యే తలసాని



చిల్డ్రన్స్ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని, ఎమ్మెల్సీ వాణిదేవి

బేగంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, పాటలు నేర్పిస్తే వారి జీవితం ఉత్సాహంగా ఉంటుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం బేగంపేట బ్రాహ్మణవాడిలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ చిల్డ్రన్స్ పార్కును ఎమ్మెల్సీ వాణిదేవి, కార్పొరేటర్ టి.మహేశ్వరితో కలిసి తలసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ మాజీ ప్రధాని పీవీ ఆశయాల సాధన కోసం వాణిదేవి కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే వాణిదేవి మాట్లాడుతూ చిల్డ్రన్ పార్కుకు ఆర్థిక సాయం చేసిన రజిత వద్దిరాజుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సురభి సోలార్ డైరెక్టర్ శేఖర్ మారంరాజు, బీఆర్ఎస్ నాయకులు టి. శ్రీహరి, నరేందర్, శ్యామ్‌సుందర్, శేఖర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కడుపుబ్బా నవ్వించిన 'బాసిన మాతాకి జై'



'బాసిర మాతాకి జై' హిందీ నాటక ప్రదర్శనలోని దృశ్యం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి కుటుంబ నేపథ్యంగా సాగే 'బాసిర మాతాకి జై' నాటకం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. ఆర్మీ మాజీ అధికారి కెప్టెన్ అహ్మద్ రాసిన ఈ హిందీ హాస్య నాటకాన్ని రోడ్డువేజ్, స్ట్రీట్ ప్లే థియేటర్ సంయుక్త నిర్వహణలో బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో ప్రదర్శించారు. ప్రేమ, ఆప్యాయతలు కలగలసిన కుటుంబ సంబంధాలు ఇతివృత్తంగా నాటకం సాగుతుంది. అందులో వంటల్లో వినూత్న ప్రయోగాలు చేయడమే ప్రధాన వ్యాపకంగా సాగే గృహిణి పాత్ర ఆద్యంతం నవ్విస్తుంది. ఓ వైపు హాస్యాన్ని పండిస్తూనే, మరోవైపు తల్లిదండ్రులను కోల్పోయిన తన భర్త తోబుట్టువులను పెంచడం కోసం ఆమె జీవితాన్ని అంకితం చేయడం... ప్రేక్షకుల మనసును కదిలిస్తుంది. ఆహార వృధా సమస్యను స్పృశించారు. ఆణి ముత్యాల్లాంటి హిందీ పాటలతో 45నిమిషాల పాటు నాటకం కొనసాగుతుంది. ప్రదర్శనను తిలకించిన నటి పూనమ్ గులేచా మాట్లాడుతూ నటీనటుల అభినయాన్ని ప్రశంసించారు. ముఖ్యంగా సీమాఖాన్ నటనను ప్రత్యేకంగా ప్రస్తావించారు. కథ నడిచిన విధానం అలరించిందని రచయితను అభినందించారు. రచయిత అహ్మద్ దర్శకత్వాన్ని కొనియాడారు. త్వరలో తాను రాసిన హిందీ నాటకాలు పుస్తకంగా రానున్నాయని అహ్మద్ తెలిపారు.

'ఇండియా ఎట్-100' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కృష్ణమూర్తి సుబ్రమణియన్, ప్రొ.మదన్, సాయిప్రసాద్

రాయదుర్గం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ ఆర్థిక వ్యవస్థలో సంస్కృతి, కట్టుబాట్లు వేల సంవత్సరాలుగా అనుసంధానమై ఉండటంతోనే కోవిడ్‌లాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా భారతీయ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలకుండా తటస్థంగా ఉందని సీఐఐ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఛైర్మన్ ప్రసాద్ అన్నారు. ప్రధాన మంత్రి కార్యాలయంలో 17వ ఆర్థిక ముఖ్య సలహాదారుగా పనిచేసిన ఐఎస్‌బీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి సుబ్రమణియన్ రచించిన 'ఇండియా ఎట్-100' పుస్తకాన్ని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్, సీఐఐ తెలంగాణ కౌన్సిల్ ఛైర్మన్ సాయిప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎస్‌బీ డీన్ మదన్ పుస్తక రచయిత కృష్ణమూర్తితో నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ.. 2014 తర్వాత దేశంలో అమలు చేయబడిన విధానాలతో రాబోయే రెండు దశాబ్దాల్లో 55 వేల ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారనుందన్నారు. దేశంలో 25 సంవత్సరాల తర్వాత ఆర్థిక పరిపుష్టి కోసం మంచి అవకాశాలు లభిస్తున్నాయని ఇది ఇలాగే కొనసాగి భారత్ బలమైన దేశంగా ఏర్పడుతుందన్నారు. ప్రేక్షకులతో కిక్కిరిసిన ఆడిటోరియంలో ఘనంగా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మదన్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుగుదల పట్ల ఆసక్తి ఉన్న ఎవరికైనా ఇది అమూల్యమైన పుస్తకమని పేర్కొన్నారు. ఈ పుస్తకంలో సూక్ష్మ ఆర్థికదృష్టి, వృద్ధిపై స్థూల ఆర్థిక ప్రాధాన్యం, సామాజిక ఆర్థిక చేరికపై సూక్ష్మ ఆర్థిక దృష్టి, చర్చించడం జరిగిందని పలువురు కొనియాడారు.

ఆంగ్ల ఉపాధ్యాయున్ని హతమార్చిన నిందితుడి అరెస్ట్

అమీర్‌పేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తాగి గొడవ చేయడం మానుకోవాలని నివారించబోయినందుకు ఆంగ్ల ఉపాధ్యాయుడిని అతి దారుణంగా హతమార్చిన సంఘటనలో ఎట్టకేలకు నిందితుడిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో కలిసి ఏసీపీ వెంకటరమణ వివరాలను వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా తంగెళ్లమూడి యాదవనగర్‌కు చెందిన నిందితుడు కె.గణేష్ అలియాస్ గని(27) క్షౌరవృత్తి చేస్తూ అమీర్‌పేట ఈస్ట్ శ్రీనివాస్‌నగర్‌లోని హనుమా యోగా లక్ష్మీ అన్నపూర్ణ కాశీ విశ్వేశరస్వామి బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇదే హాస్టల్‌లో ఉంటున్న జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌కు చెందిన నీలి వెంకటరమణ(38) రవీంద్ర భారతి హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గత నెల 27 రాత్రి మద్యం మత్తులో హాస్టల్‌కు చేరుకున్న నిందితుడు గణేష్ తలుపులను బలంగా తన్నాడు. దీంతో గణేష్‌కు వెంకటరమణకు మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో గణేష్ విచక్షణ కోల్పోయి తన బ్యాగ్‌లో ఉన్న గడ్డం గీసే కత్తితో వెంకటరమణ గొంతు కోసి హతమార్చి అక్కడ నుంచి పరారయ్యాడు. రూమ్ మేట్స్ హాస్టల్ నిర్వాహకులు కలిసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. 16 రోజులుగా తప్పించుకు తిరుగుతున్న గణేష్‌ను సోమవారం వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, ఎస్ఆర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా వలపన్ని బాలానగర్ వైజంక్షన్ వద్ద పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ శ్వాస పరీక్షకు నిరాకరిస్తూ మహిళ హంగామా

- కానిస్టేబుల్ సెల్‌ఫోన్, ఎస్సై బాడీ కెమెరా ధ్వంసం

బంజారాహిల్స్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో శ్వాస పరీక్షకు సహకరించకుండా ఓ మహిళ హంగామా సృష్టించింది. ట్రాఫిక్ కానిస్టేబుల్ సెల్‌ఫోన్, ఎస్సై బాడీ కెమెరాను ధ్వంసం చేసింది. వీకెండ్ సందర్భంగా ఈనెల 11న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు పార్క్‌హయత్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మహారాష్ట్రకు చెందిన ఐ10 కారు వచ్చింది. ఓ మహిళ కారు నడుపుతుండగా మరో ముగ్గురు మహిళలు ఉన్నారు. కానిస్టేబుల్ నరేష్ డ్రైవింగ్ సీటులో ఉన్న మహిళకు శ్వాస పరీక్ష చేసేందుకు ప్రయత్నించాడు. కానీ ఆమె సహకరించకపోగా దుర్భాషలాడుతూ అతని సెల్‌ఫోన్ నేలకేసి కొట్టింది. అక్కడే ఉన్న ఎస్సై అవినాష్‌బాబు బాడీ కెమెరాను ధ్వంసం చేసింది. ఇంతలో వారికి సంబంధించిన ఇద్దరు వ్యక్తులు అక్కడకు వచ్చారు. మాటల్లో పెట్టి మహిళలను అక్కడి నుంచి తప్పించడంతో పాటు పోలీసులతో వాగ్వాదానికి దిగి తోసి వేశారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకొగా మద్యం తాగినట్టు తేలింది. నరేష్ ఫిర్యాదు మేరకు వీరిద్దరితో పాటు మహిళలపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగిని వెంబడించి కత్తితో బెదిరించి దోపిడీ

బంజారాహిల్స్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగిని వెంబడించి కత్తితో బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కొని, కొట్టి వదిలేసిన దుండగులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాయదుర్గంకు చెందిన మోక్షిత్ కిరణ్ ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 11న విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనం పై మూసాపేట చెరువు నుంచి వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు నంబర్ ప్లేటు లేని ద్విచక్ర వాహనంపై వెంబడించారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయానికి రాగానే మోక్షిత్‌ను అడ్డగించారు. ఓ వ్యక్తి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కున్నాడు. అనంతరం మోక్షిత్‌ను అతని వాహనాన్ని తీసుకొని హైటెక్ సిటీ అటు నుంచి బంజారాహిల్స్‌లోని పంజాగుట్ట హిందూ శ్మశాన వాటికకు తీసుకువచ్చారు. తీవ్రంగా కొట్టి అతని జేబులో ఉన్న రూ.500 తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు కొనేందుకు సైబర్ ఫ్రాడ్ ద్వారా వచ్చిన డబ్బు

- బ్యాంకు ఖాతాను స్తంభింపజేసిన అధికారులు
- మోసం చేశారంటూ ఎన్ఆర్ఐ మహిళ ఫిర్యాదు

బంజారాహిల్స్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇల్లు కొనేందుకు ఓ వ్యక్తి తన బ్యాంకు ఖాతాలో సైబర్ ఫ్రాడ్ ద్వారా వచ్చిన డబ్బు జమచేయడంతో పాటు తన ఇంటిని ఆక్రమించాడని ఎన్ఆర్ఐ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తన బ్యాంకు ఖాతను అధికారులు స్తంభింపజేశారని ఆమె పేర్కొన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నం.12కు చెందిన బినోతి మార్తాండ్‌కు జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో ఓ ఇల్లు ఉంది. దాన్ని అమ్మకానికి పెట్టిన ఆమె అమెరికాకు వెళ్లారు. ఈ బాధ్యతలను చూసుకోవాల్సిందిగా మధ్యవర్తి గురునాథ్‌కు అప్పగించారు. 2022లో షేక్ బషీర్ అలియాస్ బాబు అనే వ్యక్తి ఆమెకు వాట్సాప్ కాల్ చేసి ఇల్లు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపించాడు. 10.50 కోట్ల రూపాయలకు అమ్ముతానని బినోత్ చెప్పారు. ఈ మేరకు ఇంటికి సంబంధించిన కాగితాలను వాట్సాప్ ద్వారా పంపించారు. ఆ తరువాత బాబు ఫోన్ చేయలేదు. తిరిగి ఈ యేడాది జూలైలో ఫోన్ చేయగా ఇంటి ధర పెరిగిందని 12.5కోట్ల రూపాయలకు అమ్ముతానని బినోత్ చెప్పడంతో అతను సరే అని చెప్పి ఒప్పందం కుదుర్చుకున్నాడు. పలు దఫాలుగా బ్యాంకు ద్వారా 11కోట్ల రూపాయలు పంపించాడు. టీడీఎస్ కలుపుకొని ఇంకా సుమారు మూడు కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. బినోత్ వాచ్‌మన్‌కు చెప్పడంతో అతను బాబుకు తాళం ఇచ్చాడు. కానీ కొద్ది రోజులకే బ్యాంకు అధికారులు బినోత్ బ్యాంకు ఖాతాను స్తంభింపజేశారు. సైబర్ ఫ్రాడ్ ద్వారా వచ్చిన డబ్బు ఆమె ఖాతాలోకి మళ్లినట్టు బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. వెంటనే బాబును సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. దీంతో ఆమె గత నెల 28న కుమారుడితో కలిసి నగరానికి వచ్చింది. తన ఇంటి వద్దకు వెళ్లగా అప్పటికే బాబు పూర్తిగా ఇంటిని ఆక్రమించుకున్నాడు. ఆమె ఏర్పాటు చేసిన కెమెరాలు తొలగించి తన సీసీ టీవీ కెమెరాలను బిగించాడు. అతన్ని సంప్రదించేందుకు ఆమె చాలాసార్లు ప్రయత్నించారు. కానీ అందుబాటులోకి రాలేదు. మోసపోయినట్టు గ్రహించిన బినోత్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు బీఎన్ఎస్ 318(4), 329(4), 324(4), 351(2), 351(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు భద్రతపై శిక్షణ ఇస్తున్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్ రాజు

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకు రోడ్డుపై ప్రయాణించే అందరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు సూచించారు. సోమవారం రోడ్డు భద్రతపై సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాదచారులు, వాహనదారులు పాటించాల్సిన నియమాలు- ప్రమాదాల నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఎక్కువగా యువత ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని, వీటితోపాటు మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణమని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ. 5 వేల జరిమానా, 3 నెలల జైలుశిక్ష విధిస్తారని హెచ్చరించారు. కార్యక్రమములో ప్రిన్సిపాల్ డా. ఉమా జోసెఫ్, ఎన్ఎస్ఎస్. ఆర్గనైజర్ విజయ్‌కుమారి, 100 మంది విద్యార్థులు, పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ ధర్మారావు, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- ఈఎస్ఐసీలో వైద్యుల నిరసన

సనత్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో గల ఆర్‌జీకార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ వైద్య కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ వైద్య కళాశాల విద్యార్థులు సోమవారం ఆస్పత్రిలో ఆవరణలో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద వైద్యవిద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్య విద్యార్థులు మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన సంఘటన దేశ వ్యాప్తంగా వైద్య విద్యార్థులను భయాందోళనకు గురిచేసిందన్నారు. మృతిచెందిన వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

రెడ్ అంబులెన్స్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలి



నిమ్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న తెలంగాణ ప్రైవేటు అంబులెన్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బంజారాహిల్స్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రెడ్ అంబులెన్స్ దోపిడీకి ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని తెలంగాణ ప్రైవేటు అంబులెన్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నిమ్స్ ఆవరణలో సోమవారం అంబులెన్స్ యజమానులు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నక్క మహేష్ మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ పీఏ తిరుపతి అండదండలతో రెడ్ అంబులెన్స్ సేవలు నడుపుతున్నారని ఆరోపించారు. సేవ పేరిట రెడ్ అంబులెన్స్ దోపిడీ చేసి ప్రైవేటు అంబులెన్స్‌ల పొట్టకొట్టేలా కార్పొరేట్ వ్యాపారం చేస్తుందన్నారు. ఈ దోపిడీని అడ్డుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంబులెన్స్ యజమానులు, డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం, వైద్యశాఖ కలుగజేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేష్, సలీం, కుమార్, సత్య, ఖలీద్, మనోజ్ పాల్గొన్నారు.



ప్రకాశ్‌నగర్ స్లమ్‌లోని కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తు ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న బేగంపేట కార్పొరేటర్ టి. మహేశ్వరి, నాయకులు శ్రీహరి, తాళ్ల రాజయ్య తదితరులు

- బేగంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి)



యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐలు డాక్టర్ మహదేవ్, పద్మాంజలిలు రూ.1.30లక్షల విలువ చేసే బాస్కెట్‌బాల్ పోల్, కిట్, టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహ, ఫిజికల్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

-యూసుఫ్‌గూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి)



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న టాలీవుడ్ నటి, బిగ్‌బాస్ ఫేమ్ అశ్విని

సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 2024 ప్రారంభం

సికింద్రాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, డిజైనర్లు, చేనేత ఔత్సాహికులను ఒక్క చోటకు చేర్చి, చేనేత నేత గొప్ప సాంప్రదాయాలను జరుపుకునేందుకు సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 2024 ఘనంగా ప్రారంభమైంది. సికింద్రాబాద్ బాలంరాయిలోని క్లాసిక్ గార్డెన్స్‌లో ఈనెల 18వ తేదీ వరకు జరిగే ఈ ప్రదర్శనను సోమవారం టాలీవుడ్ నటి, బిగ్ బాస్ ఫేమ్ అశ్విని, నిర్వాహకులు సోమనాథ్ బౌమిక్, అభిజిత్‌షాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అశ్విని మాట్లాడుతూ భారతదేశపు సుసంపన్నమైన, విభిన్నమైన చేనేత సాంప్రదాయాల గొప్ప వేడుకైన సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పోకు హాజరు కావడం ఎంతో ఆనందదాయంగా, గౌరవంగా భావిస్తున్నాట్టు చెప్పారు. ప్రతిభావంతులైన నేత కార్మికులను ప్రోత్సహించడానికి, అండగా ఉండడానికి ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్టు సోమనాథ్, అభిజిత్‌లు తెలిపారు. బనారస్ చీర, భాగల్‌పురి సిల్క్, బెంగుళూరు సిల్క్, చెన్నై సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జామ్దానీ, లెనిన్ కాటన్, టస్సార్, విష్ణుపురి సిల్క్, డ్రెస్ మెటీరియల్, చందేరిలలో చేనేత కళాకారులు తమ కళను ప్రదర్శిస్తున్నారు.



బోయిన్‌పల్లిలోని మహాకాళి ఆలయం వార్షికోత్సవ వేడుకలలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

మహాకాళి ఆలయ వార్షికోత్సవం

బోయిన్‌పల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు ఆరో వార్డులోని మహాత్మానగర్‌లోని మహాకాళి ఆలయం 16వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి కృపకు పాత్రులు కావాలని కోరారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాల్యాద్రి, ప్రేమ్, పోచయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



బీజేఆర్‌నగర్ దేవాలయంలో ప్రత్యేక పూజకు హాజరైన మైనంపల్లి హన్మంతరావు

ఘనంగా జల్లి కడవ ఉత్సవం

పద్మారావునగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో శ్రావణమాస బోనాల జాతరలో భాగంగా సోమవారం బీజేఆర్ నగర్‌లోని శ్రీ గణపతి నల్లపోచమ్మ ముత్యాలమ్మ దేవాలమంలో జల్లి కడవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుల్లు, డీజే పాటలు, నృత్యాలతో బన్సీలాల్‌పేట్ ప్రధాన దారులలో ఊరేగింపును నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు ప్రత్యేక పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించారు.

పాత కక్షలతో కుటుంబంపై దాడి

● అడ్డగుట్ట లోహియానగర్‌లో ఘటన



అడ్డగుట్టలో లోహియానగర్ బస్తీలో జరిగిన ఘర్షణ

అడ్డగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో ఓ వర్గం వారు కుటుంబంపై రాళ్ల దాడి చేయడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ వివరాల ప్రకారం.. అడ్డగుట్ట లోహియానగర్‌లో ఆదివారం రాత్రి బోనాల ఉత్సవాలు జరిగాయి. అదే బస్తీకి చెందిన లలిత కుటుంబ సభ్యులకు, మరో వర్గానికి చెందిన పలువురు పాతకక్షల కారణంగా కొట్టుకున్నారు. 30 మంది రాళ్లతో లలిత కుటుంబ సభ్యులపై దాడి చేయడంతో పలువురు తలలకు గాయాలై స్పృహ కోల్పోయారు. పోలీసులు చేరుకొని గాయపడిన వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. రెండు వర్గాల కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

రాడార్ ప్రాజెక్టుకు రిజర్వ్ ఫారెస్ట్ భూమిని కేటాయించొద్దు

పంజాగుట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోని సహజమైన అటవీ భూములను భారత నౌకాదళానికి వెరీ లో ఫ్రీక్వెన్సీ(వీఎల్ఎఫ్) రాడార్ స్టేషన్ కోసం కేటాయించొద్దని వివిధ సంస్థల నాయకులు డిమాండ్ చేశారు. అనంతగిరి కొండల్లోని సహజమైన అటవీ భూములను వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ కోసం కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.కార్తీక్‌యాదవ్, సమన్వయకర్త రాజుయదవ్, భారత్ కిసాన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డి.కె.చంద్రశేఖర్‌యాదవ్, గీత, సామాజిక కార్యకర్త రుచిత్ ఆశా కమల్, శ్రీశైలంయాదవ్, ఆదిత్య, లోకేష్, తదితరులు మాట్లాడారు. విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ (ఈఎన్సీ)ప్రతిపాదించిన వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ తక్కువ ఫ్రీక్వెన్సీ రేడియో తరంగాలను ఉపయోగించి నౌకలు, జలాంతర్గాములతో కమ్యూనికేట్ చేస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం అడవుల్లో 2,900 ఎకరాల అటవీ భూమిలోని 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందని అన్నారు. 20 గ్రామాల్లోని సుమారు 60వేల మంది ప్రజల జీవితాలపై, అడవిపై ఆధారపడిన చిన్న రైతులు, పశువుల మేత, జీవుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ విధ్వంసం పెరిగి నేల కోతకు గురవుతుందని, మూసీ, కాగ్నా, తదితర నదులపై కూడా ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రపంచ వాతావరణ సంక్షోభాల రిత్యా దామగుండం అడవుల్లో రాడార్ ప్రాజెక్టును కొనసాగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లిలో నివసిస్తున్న స్రవంతి కుటుంబ సభ్యులతో కలిసి ఔరంగాబాద్ వెళ్లింది. తిరుగు ప్రయాణంలో అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. నిజామాబాద్ వద్ద ఆమె బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అందులో ఒకటిన్నర తులాల బంగారు నల్లపూసల గొలుసు, రెండు సెల్ ఫోన్లు, 20 పౌండ్స్ విదేశీ కరెన్సీ ఉంది. బాధితురాలు సోమవారం కాచిగూడ చేరుకున్న తర్వాత రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

'పటేల్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి'

అంబర్‌పేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పటేల్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం పటేల్‌నగర్‌లో ఆయన పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలను సత్ప్రవర్తన కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలి

● బీజేపీ నాయకురాలు మాధవీలత



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు మాధవీలత

పద్మారావునగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశ సంక్షేమం కోసం మన పిల్లలను సత్ప్రవర్తన కలిగిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని బీజేపీ నాయకురాలు మాధవీలత అన్నారు. పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో వారణాసికి చేందిన శ్రీ స్వామి అభిషేక్ బ్రహ్మచారి దివ్యాశిస్సులతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న విద్యా కోటి కుంకుమార్చన మహాయజ్ఞం కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆమె మాట్లాడుతూ మాతృత్వం అనేది ఒక వరమని, తమ పిల్లలను సక్రమంగా పెంచాలని మహిళలు సౌభాగ్యంగా ఉంటేనే సమాజం, దేశం బాగుంటుందని అన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు అనేక ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వందల సంఖ్యలో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలో ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా మన మనస్సులోని కోరికలు తీరి, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యువ చేతన జాతీయ సమన్వయకర్త రోహిత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రపంచం యావత్తు భారతదేశం వైపు చూస్తోందని, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు పాత్రను నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమానికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్రరావు, అధికార ప్రతినిధి సుభాష్‌రావు, హాజరయ్యారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు మంగళవారం కొనసాగుతాయని యువచేతన జాతీయ సమన్వయకర్త రోహిత్ సింగ్ తెలిపారు.

తార్నాకలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



తార్నాక చౌరాస్తాలో జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి తదితరులు

తార్నాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మహాకాళి సికింద్రాబాద్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అనిత ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తార్నాక చౌరాస్తా నుంచి లాలాపేట్ వరకు భారీ బైక్ ర్యాలీని చేపట్టారు. కార్యక్రమానికి బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ముఖ్య అతిథులుగా హాజరయి బైక్ ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించడంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. భారతదేశాన్ని సంఘటితంగా ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయుడుపైన ఉందని, ఆ దిశగా ప్రతి ఒక్కరు దేశం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుప్రియ గౌడ్, దీపికా, బీజేపీ నాయకులు మేకల కీర్తి హర్షకిరణ్, శారదా మల్లేష్, మేకల సుజాత, అనూష, సరోజ, లక్ష్మీ దిలారి, యాదమ్మ, రాముపర్మ, వెంకటేశ్ గౌడ్, పోచయ్య యాదవ్, ప్రకాష్ గౌడ్, ప్రభుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

వేణుస్వామిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు



మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు డిజిటల్ మీడియా సభ్యులు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో సినీ ప్రముఖులపై వ్యాఖ్యలు చేస్తూ ప్రఖ్యాతి పొందిన వేణుస్వామి ఈ మధ్య జరిగిన అక్కినేని నాగ చైతన్య, శోభిత ధూళిపాళల నిశ్చితార్థం రోజున వారి జాతకాలను విశ్లేషణ చేస్తూ చేసిన వీడియో పెనుదుమారం లేపింది. వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్‌లు సోమవారం ఎంజీ రోడుల్లో బుద్ధభవన్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో చైర్ పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గతంలో సినిమా రిలీజ్‌లపై, రాజకీయ ఫలితాలపై ఇలాంటి వ్యాఖ్యలే చేసి అబాసు పాలైనా బుద్ధి రాలేదని, అసలు వ్యక్తిగత విషయాలు నలుగురిలో మాట్లాడకూడదు అనే జ్ఞానం కూడా లేని వేణుస్వామి వాళ్లు ఎప్పుడు విడిపోతారో కూడా చెప్పేసాడని అన్నారు. ఈ విషయంపై స్పందించిన నేరెళ్ల శారద వేణుస్వామిని పిలిలించి వివరణ అడుగుతామని, ఆయనపై, టెలికాస్ట్ చేసిన యూ ట్యూబ్ చానల్స్‌పైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

కార్యక్రమంలో తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వై.జె.రాంబాబు, కోశాధికారి సురేంద్ర కుమార్ నాయుడు, ప్రసాదం రఘు, లక్ష్మీ, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షురాలు వనం ప్రేమమాలిని, కార్యదర్శి వేదుల మూర్తి, సభ్యులు సువర్ణ, తేజస్విని, భాగ్య లక్ష్మీ, కుమార్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు వనజ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను దేశం నుంచి తరిమికొట్టాలి

● విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు వ్యక్తి ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాకుండా వారి కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తాయని, ప్రతి ఒక్కరూ దేశాన్ని డగ్స్ రహితంగా మార్చడానికి కృషిచేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ అన్నారు. గోల్కొండ ప్రభుత్వ బాలుర ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన శైలజతో పాల్గొని విద్యార్థులతో డ్రగ్స్ ఫ్రీ ఇండియా, డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో, కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం జరగకుండా చూడాలన్నారు. ఎవరైనా అలా చేస్తే వెంటనే సంబంధిత ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ వల్ల వ్యక్తి ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా, కుటుంబం, సమాజం మొత్తానికి దెబ్బతీస్తుందని అన్నారు. ఇంట్లో, పాఠశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం జరగకుండా చూడాలన్నారు. కోవిడ్ మహమ్మారిని తరిమికొట్టినట్లే మాదకద్రవ్యాలను దేశం నుంచి పారదోలాలని పిలుపునిచ్చారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో జూనియర్ కళాశాలలో డ్రగ్ రహిత తెలంగాణ, డ్రగ్ రహిత భారత్ సాధించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఆర్.రోహిణి, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్, డిప్యూటీ డీఈఓ రమణ రాజు, డిప్యూటీ ఐఓఎస్ మాహూల్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపాల్ మైత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్‌లో లాభాలంటూ యువకుడిని నమ్మించి..

● రూ.5.93 లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్లో లాభాలంటూ నగర యువకుడిని నమ్మించిన సైబర్ క్రిమినల్స్ అతడి నుంచి రూ.5,93,840లను కొల్లగొట్టారు. మోసపోయిన బాధితుడు సోమవారం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 31 ఏళ్ల యువకుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి గుర్తుతెలియని నంబర్ నుంచి 'ఎఫ్-20 ఫిడిలిటీ స్టాక్ ఇన్వెస్టిమెంట్ గైడ్' అనే వాట్సాప్ సందేశం వచ్చింది. తాము ఇచ్చే సూచనల ఆధారంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు అందుకోవచ్చు అంటూ.. నమ్మించారు. అది నమ్మిన యువకుడు వారు చెప్పిన సూచనలు పాటిస్తూ.. స్టాక్ మార్కెట్లో వ్యాపారం చేస్తూ కొద్దిమొత్తంలో లాభాలు ఆర్జిస్తున్నాడు. ఆ తర్వాత లైన్‌లోకి వచ్చిన కొందరు వ్యక్తులు ఎఫ్-20 ఫిడిలిటీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అత్యధిక లాభాలు వస్తాయని నమ్మించారు. ప్రతిరోజూ రాత్రి 8-9 గంటల మధ్య శిక్షణ తరగతులు నిర్వహించి ఆతర్వాత ట్రేడింగ్‌లో పాల్గొనేలా చేస్తామన్నారు. అలా నమ్మకాన్ని కలిగించిన నిందితులు ఆతర్వాత 150మంది సభ్యులున్న గ్రూపులో యువకుడిని యాడ్ చేశారు. అలా మెల్లగా లాభాలు వస్తున్నట్లు నమ్మించి బాధితుని పేరుతో ఐపీవో షేర్లు కేటాయించారు. అందుకు సరిపడా డబ్బులు లేకపోవడంతో బాధితుడు విరమించుకునే ప్రయత్నం చేయగా ఒప్పుకోలేదు. 150శాతం లాభాలు వస్తాయని నమ్మించారు. ఆ తర్వాత మంచి లాభాలు వచ్చినట్లు వర్చువల్‌గా చూపించారు. ఆ డబ్బును ఉపసంహరించుకోవాలని చూడగా విత్‌డ్రా ఆప్షన్‌క్లోజ్ చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఐపీవో షేర్లు కేటాయించడానికి మేం చెల్లించిన మొత్తంతో పాటు.. వచ్చిన లాభాలపై 10శాతం కమీషన్ చెల్లించాలని మెలికపెట్టారు. దాంతో బాధితుడు విడతలవారీగా రూ. 5,98,840లు చెల్లించాడు. అయినా ఇంకా డబ్బులు చెల్లించాలని ఇబ్బంది పెడుతుండటంతో ఇదేదో మోసంలా ఉందని గుర్తించిన బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● ఈఎస్ఐసీలో వైద్యుల నిరసన

సనత్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీకార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ వైద్య కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ వైద్య కళాశాల విద్యార్థులు సోమవారం ఆస్పత్రిలో ఆవరణలో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద వైద్యవిద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్య విద్యార్థులు మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన సంఘటన దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులను భయాందోళనకు గురిచేసిందన్నారు. మృతిచెందిన వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.



విద్యార్థినులకు రోడ్డు భద్రతపై శిక్షణ ఇస్తున్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్ రాజు

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

● బేగంపేట టీటీఐ ఏసీపీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకు రోడ్డుపై ప్రయాణించే అందరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు సూచించారు. సోమవారం రోడ్డు భద్రతపై సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాదచారులు, వాహనదారులు పాటించాల్సిన నియమాలు-ప్రమాదాల నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఎక్కువగా యువత ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని, వీటితోపాటు మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణమని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేల జరిమానా, 3 నెలల జైలుశిక్ష విధిస్తారని హెచ్చరించారు. కార్యక్రమములో ప్రిన్సిపాల్ డా.ఉమా జోసెఫ్, ఎన్ఎస్ఎస్. ఆర్గనైజర్ విజయ్‌కుమారి, 100 మంది విద్యార్థులు, పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ ధర్మారావు, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.



ప్రజల వద్ద సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, అధికారులు

పెండింగ్ పనులను వెంటనే చేపట్టాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనులను వెంటనే చేపట్టి ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని తొలగించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని కళాసీగూడలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి ప్రజలను ఆడిగి సమస్యలు తెలుసుకున్నారు. నాలా వెంట సీవరేజి పైపు లైన్ పనులు పూర్తి చేసి తిరిగి రోడ్డు నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాట్లు, నల్లాల ద్వారా సరఫరా అవుతున్న మంచినీరు కలుషితం అవుతున్నట్లు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వర్షపు నీరు ఎక్కడ నిలవకుండా సీవరేజి లైన్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమయ్య, ఈఈ సుదర్శన్, జలమండలి జీఎం ఆశీష్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వజరపు ఆంజనేయులు, నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు

బొల్లారంలో ఉచిత వైద్య శిబిరం

తిరుమలగిరి ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అరికట్టడానికి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని డాక్టర్ నాగార్జున అన్నారు. సోమవారం బొల్లారంలోని రీడింగ్ రూమ్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విష జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల వృద్ధి చెందడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని అన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ బ్యాగులు ఇతర పదార్థాలు నీరు నిలవ ఉండటం వలన దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు వస్తున్నాయన్నారు. రెండు రోజుల పాటు జ్వరం ఉంటే ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీ.వి.బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

వయో వృద్ధులకు ఆయుష్ వైద్య శిబిరం

చిలకలగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ చింతబావిలో సోమవారం వయో వృద్ధులకి ప్రత్యేక ఆయుష్ వైద్య శిబిరం నిర్వహించారు. చిలకలగూడ ప్రభుత్వ యూనానీ డిస్పెన్సరీ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కవితా రాథోడ్, డాక్టర్ మంజుల, డాక్టర్ రమ శ్రీదేవీల బృందం వయో వృద్ధులకి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా అవసరమైన ముందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవితా రాథోడ్ మాట్లాడుతు వయసు పైబడినా వారు ఆహార అలవాట్లు పాటిస్తు వ్యాయమం, క్రమమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటు అప్రమత్తంగా వుండాలని సూచించారు.

మైలార్‌గడ్డలో సీసీ రోడ్డు పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. సోమవారం జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్‌తో కలిసి ఆమె మైలార్‌గడ్డలో పర్యటించారు. సుమారు రూ.54 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నామని, సీసీ రోడ్డు పనులు తొందరగా పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు.



అక్రమ నిర్మాణాలపై జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

బౌద్ధనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో కాంగ్రెస్ పార్టీ సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు బండి అభిషేక్ తదితరులు సికింద్రాబాద్ సర్కిల్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. డివిజన్ పరిధిలో పలుచోట్ల నిబంధనలు పాటించకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



బోయిన్‌పల్లి వీఆర్ ఆస్పత్రి వద్ద రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

బోయిన్‌పల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంతకాలంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు లైసెన్స్‌లు లేకుండా రాంగ్‌రూట్‌లలో వెళ్తూ ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా ప్రమాదాలకు కారకులు అవుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలు నడిపిస్తున్న మైనర్‌లను అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో విద్యార్థుల తల్లితండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పైన్లు వేసి చలాన్లు కట్టించుకుని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపిస్తూ పట్టుబడితే తల్లితండ్రులపైన కేసులు తప్పవని హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీఆర్ స్టేడియం బస్టాప్ వద్ద సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సుగల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు భిక్షాటన చేసుకునేవాడని స్థానికులు తెలిపారు.